





హెచ్‌సీయూ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ వర్సిటీ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను గల్లాపట్టి, అమాంతం పైకి ఎత్తి వ్యానులోకి తరలిస్తున్న పోలీసులు

# భగ్గుమన్న విద్యార్థిలోకం

## అట్టుడుకుతున్న హెచ్‌సీయూ.. రేవంత్ సర్కార్‌పై విద్యార్థుల పోరుబాట

- జీవవైవిధ్యాన్ని కాపాడాలని నిరసనలు
- విద్యార్థులకు మద్దతుగా సకల జనులు
- బీఆర్‌ఎస్, బీజేపీ నేతల హౌజ్ అరెస్టు
- వర్సిటీకి పార్టీలు, ప్రజాసంఘాల నేతలు
- పోరాటం ఆగదన్న వర్సిటీ విద్యార్థులు
- రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న మద్దతు

హైదరాబాద్ సిటీబ్యూరో, కొండాపూర్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): కంచె గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థిలోకం భగ్గుమన్నది. వారి పోరాటానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఆందోళనలు, నిరసనలు, బుల్డోజర్ల చప్పుళ్లు, పోలీసుల అరెస్టులతో వర్సిటీ ప్రాంగణమంతా దద్దరిల్లింది. విద్యార్థులు, నాయకుల నినాదాలతో అట్టుడికింది. విద్యార్థుల పోరాటానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్టీలు, విద్యార్థి సంఘాలు నిరసనలు, ఆందోళనలు చేపట్టాయి. బీఆర్‌ఎస్, బీజేపీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలను యూనివర్సిటీ వద్దకు రానీయకుండా ఎక్కడికక్కడ పోలీసులు హౌజ్ అరెస్టులు చేశారు. విద్యార్థులు క్యాంపస్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగారు. సోమవారం రాత్రి నుంచి విద్యార్థులు యూనివర్సిటీ మెయిన్ గేటు ముందే బైఠాయించి నిరసనలు చేపట్టారు. విద్యార్థులకు మద్దతుగా బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు భారీ ఎత్తున చేరుకుని మద్దతు తెలిపారు. వర్సిటీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వందలాదిగా మోహరించిన పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని వ్యాన్లలోకి ఎక్కించారు. ఆందోళనకారులను అరెస్ట్ చేయడంతో మెయిన్ గేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది.

### ఎక్కడికక్కడ హౌజ్ అరెస్టులు

విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు బయలుదేరిన బీఆర్‌ఎస్, బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులను హౌజ్ అరెస్ట్ చేశారు. హెచ్‌సీయూకు బయలుదేరిన బీజేపీ ఎమ్మెల్యేలను హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు 68 మందిని అరెస్ట్ చేసి రాయదుర్గం, రాజేంద్రనగర్, నార్సింగి, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు.



హెచ్‌సీయూ వద్ద భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

### రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు

న్యూస్ నెట్‌వర్క్: హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. హైదరాబాద్ కేబీఆర్ పార్కు ముందు బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పాతూరి సుధాకర్‌రెడ్డి, సినీ సంగీత దర్శకుడు మణిశర్మ పాల్గొని జీవవైవిధ్యాన్ని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. చిక్కడపల్లిలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో వివిధ విద్యార్థి సంఘాలు భారీ ర్యాలీ చేపట్టాయి. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఉమ్మడి వరంగల్‌జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగిన సీపీఎం నాయకులను ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణతోపాటు ఇతర విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్వీ, సీపీఎం, డీవైఎఫ్ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులను ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల్లోనూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు.

### రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్.. పోలీస్ గోబ్యాక్

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు నినదించారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినదించారు. విద్యార్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తుండటంతో 'పోలీస్.. గో బ్యాక్' అంటూ పెద్దపెట్టున నినదించారు. దీం తో విద్యార్థులందరినీ క్యాంపస్ లోపలికి నెట్టేసి మెయిన్ గేట్‌కు తాళం వేశారు. విద్యార్థులు గేటు ముందే ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

## ఢిల్లీకి హెచ్‌సీయూ సెగ!

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ఎంపీలు

### హెచ్‌సీయూ భూములను కాపాడాలి.. రాజ్యసభలో వద్దిరాజు ప్రస్తావన

### నేడు జీరో అవర్‌లో మాట్లాడేందుకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ సెగ ఢిల్లీని తాకింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదరరావు, డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రత్యేకంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎంపీలు హెచ్‌సీయూలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల అమానుషంగా, క్రూరంగా ప్రవర్తిస్తున్నదని వివరించారు. హెచ్‌సీయూ సున్నిత అంశమని, ఈ వర్సిటీ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఉన్నదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌సీయూ భూములు హైదరాబాద్‌కు లంగ్‌స్పేస్‌గా ఉన్నందున వాటిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో విలువైన హెచ్‌సీయూను కాపాడుకొనే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని గుర్తుచేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల విలువైన భూములను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నిస్తున్నదని, అందులో సహకార యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా హెచ్‌సీయూ భూములను పరిరక్షించిన వారమవుతామని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎంపీల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హెచ్‌సీయూ విద్యార్థులు కూడా బుధవారం ధర్మేంద్ర ప్రధాన్‌ను కలుస్తారని, ఈ మేరకు అపాయింట్‌మెంట్ తీసుకున్నట్టు బీఆర్‌ఎస్ ఎంపీలు తెలిపారు. హెచ్‌సీయూ అంశంపై రాజ్యసభలో జీరో అవర్‌లో మాట్లాడేందుకు నోటీసులు ఇచ్చినట్టు వెల్లడించారు.





### రాజ్యసభలో ప్రస్తావించిన వద్దిరాజు

అటు రాజ్యసభలో కూడా హెచ్‌సీయూ భూముల అంశాన్ని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రస్తావించారు. మంగళవారం రాజ్యసభలో 'త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు-2025'పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌సీయూలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయాలని ప్రయత్నిస్తున్నదని వివరించారు. హెచ్‌సీయూ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ భూముల్లో చెరువులతోపాటు అరుదైన వృక్ష సంపద, పెద్ద సంఖ్యలో నెమళ్లు, జింకలు, పక్షులు ఉన్నాయని, ఇది జీవ వైవిధ్యానికి నెలవుగా ఉన్నదని చెప్పారు. అత్యంత విలువైన ఈ భూములను వేలం వేయొద్దని విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు అభ్యర్థిస్తున్నారని, వీటిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, మనందరిపై ఉన్నదని పేర్కొన్నారు.

### విద్యార్థులను బంధించినా..



హెచ్‌సీయూ విద్యార్థులు బయటికి రాకుండా గేటు వేసిన పోలీసులు. అయినా కూడా విద్యార్థులు తమ ఆందోళనను వినూత్న రీతుల్లో ప్రదర్శించారు.

## హెచ్‌సీయూ భూముల అమ్మకం దారుణం

- ఎన్‌ఎస్‌యూఐ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): జీవవైవిధ్యానికి నెలవైన హెచ్‌సీయూ భూములను జేసీబీలతో ధ్వంసంచేసి ప్రభుత్వం అమ్ముకోవాలని చూడటం దారుణమని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు విమర్శించారు. క్యాంపస్ పరిధిలోకి వచ్చిన జేసీబీలను అడ్డుకోబోయిన విద్యార్థులను ఈడ్చుకుంటూ అక్రమంగా అరెస్టులు చేయడం తగదని మండిపడ్డారు. ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. వర్సిటీ భూములపై విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా జేసీబీలను రంగంలోకి దింపడం సరికాదని పేర్కొన్నారు. హెచ్‌సీయూకు నాడు ఇందిరమ్మ 2,300 ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. 'ఇందిరమ్మ పాలన అంటూ అధికారం చేపట్టి బుల్డోజర్ రాజ్యం నడపడం సరికాదు' అని హితవు పలికారు. తాజా ఘటనపై వర్సిటీ రిజిస్ట్రార్, వీసీ ఎందుకు అధికారిక ప్రకటనలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. క్యాంపస్‌లో ఏం జరుగుతున్నదో తమకు తెలపాల్సిన అవసరం ప్రభుత్వంపై లేదా? అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ పరిధిలోకి బుల్డోజర్లను తీసుకు రావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

# ఆ భూములకు 'కంచె' వేసింది కేసీఆరే

- పదేండ్లు కోర్టులో న్యాయపోరాటం
- వాటి ఫలితంగానే అనుకూల తీర్పు
- వాస్తవాలను దాచిన కాంగ్రెస్
- 400 ఎకరాలపై తామే తీర్పు తెచ్చినట్టు డబ్బా

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): కంచె గచ్చిబౌలి భూ వివాదం మెడకు చుట్టుకోవడంతో కాంగ్రెస్ సర్కారు ఏప్రిల్ 1న ప్రజలను ఫూల్స్ చేయడానికి ప్రయత్నించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురద చల్లేందుకు మంత్రుల బృందం తీవ్రంగా ప్రయత్నించింది. 400 ఎకరాలపై హైకోర్టు తీర్పును తామే సాధించినట్టు డబ్బా కొట్టింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఈ కేసును పట్టించుకోలేదని మంత్రులు దుష్ప్రచారం చేశారు. ఏమాత్రం ఆలోచించేవారికైనా ఈ వాదనలో పసలేదని ఇట్టే తెలిసిపోతుంది.

### కేవలం మూడు నెలల్లో సాధ్యమా?

ఉమ్మడి ప్రభుత్వం 2003, ఆగస్టు 5న ఐఎంజీ భారత్ అనే కంపెనీకి కంచె గచ్చిబౌలి భూములను కట్టబెట్టగా ఆ తర్వాత రద్దు చేయడంతో 2006 నుంచి కోర్టు కేసు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో 2024, మార్చి 7న హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో ఈ తీర్పు తమ విజయమని కాంగ్రెస్ సర్కారు ప్రచారం చేసుకుంటున్నది. కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ప్రచారం చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం 2023, డిసెంబర్ 7న ఏర్పడిన సంగతి తెలిసిందే. అంటే 20 ఏండ్లుగా కొనసాగుతున్న కేసుపై కేవలం మూడు నెలల్లోనే బలమైన వాదనలు వినిపించి తుది తీర్పును సాధించిందా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల్లోనే ఇరుపక్షాల వాదనలన్నీ పూర్తయి, ధర్మాసనం తీర్పు ఇచ్చిందని ప్రభుత్వం చెప్పగలదా? అని నిలదీస్తున్నారు.



### కేసీఆర్ అడ్డుపడకుంటే ఎప్పుడో అన్యాక్రాంతం!

ఒకవేళ కేసీఆర్ ప్రభుత్వం ఈ కేసులో ఎలాంటి కృషి చేయకపోతే.. నిపుణులైన న్యాయవాదులను నియమించి బలమైన వాదనలు వినిపించకపోయి ఉంటే కేసు ఎప్పుడో ముగిసిపోయి ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చి ఉండేదని, ఆ భూములు ఎప్పుడో అన్యాక్రాంతమై ఉండేవని విశ్లేషకులు చెప్తున్నారు. అలాకాకుండా 2024 వరకు కేసు నిలబడిందంటే పదేండ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకున్నట్టే కదా? అని స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే 2014 సెప్టెంబర్‌లో ఇంప్లీడ్ అయింది. 2017లో టీజీఐఐసీని కూడా ఇంప్లీడ్ చేయించిందని గుర్తుచేస్తున్నారు. ఇలా ఈ కేసులో అనుకూలమైన అన్ని మార్గాల్లో గట్టి ప్రయత్నాలు చేసి, బలమైన వాదనలు వినిపించడం వల్లే కేసులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని స్పష్టంచేస్తున్నారు. ఇదే విషయాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఢిల్లీలో వెల్లడించారని తెలిపారు. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అవి హైదరాబాద్ విశ్వవిద్యాలయ భూములని, అక్కడ అరుదైన జంతు, వృక్ష జాతులు నివసిస్తున్నాయన్న కారణంతో ఆ భూములను కాపాడిందని ఈటల స్పష్టంచేశారు.

## బీఆర్‌ఎస్ వాదనతోనే ఆ భూమి భద్రం

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- హెచ్‌సీయూ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి
- కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు బీజేపీ ఎంపీల వినతి



హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : నాడు బీఆర్‌ఎస్ వాదనతో సుప్రీం కోర్టు.. అది విశ్వవిద్యాలయం భూమి అని చెప్పిందని, దానిని ఎవరికీ ధారాదత్తం చేయొద్దని సూచించిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆ భూమిలో నెమళ్లు, జింకలు, పక్షులను, ఆయుర్వేద మొక్కలను చంపేసి నేడు రేవంత్‌రెడ్డి సర్కారు దానిని కాంక్రీట్ జంగల్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల ఆక్రమణను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్, నగేశ్‌తో మంగళవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో పర్యావరణ ప్రాముఖ్యతను అధ్యయనం చేసేందుకు రివ్యూ కమిటీ వేయాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. మరోవైపు భూముల అంశాన్ని రాష్ట్ర బీజేపీ ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో లేవనెత్తారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ రాజ్యసభలో ఎంపీ కే లక్ష్మణ్ ఆందోళన చేపట్టారు. ఉగాది పండుగ పూట విద్యార్థుల నెత్తురు కండ్ల చూడటం ప్రజాపాలనా? అని బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హెచ్‌సీయూలో నిరసనకు వెళ్తారన్న సమాచారంతో ఆయనను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.


# 400 ఎకరాల కేటాయింపు చట్టవిరుద్ధం

- సర్కారు జీవో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకం
- కంచె గచ్చిబౌలి భూములపై మరో పిల్ : నేడు విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలీలోని సర్వే నం.25లోని 400 ఎకరాలను టీజీఐఐసీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ఓ ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా భూమి కేటాయించారని, దీనిని రద్దు చేయాలని హైదరాబాద్‌కు చెందిన కే బాబూరావు మంగళవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసరంగా (భోజన విరామ సమయంలో) విచారణ చేపట్టాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. విచారణ బుధవారం చేపడతామని హైకోర్టు ప్రకటించింది. ఇదే అంశంపై వట ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో కలిపి విచారణ జరుపుతామని తెలిపింది.

### జీవో సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో.. టీఎన్ గోదావర్మన్ తిరుమల్పాడ్ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఉన్నదని పిటిషనర్ తెలిపారు. 'ప్రభుత్వ రికార్డుల్లో అది అటవీ ప్రాంతంగా నమోదు కాకపోయినా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెట్లు, పక్షులు ఉన్న ప్రదేశాన్ని అటవీ ప్రాంతంగా పరిగణించాలి. ఇలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి పనులకు కేటాయించడం చట్ట వ్యతిరేకం.



కేటాయించే ముందు ఓ కమిటీ ఏర్పాటుచేసి అధ్యయనం చేయాలని చట్టం నిర్దేశిస్తున్నది. దట్టమైన ఆటవీ ప్రాంతం కాకపోయినా అక్కడున్న చెట్లు, గడ్డి మొక్కల కారణంగా పక్షులకు, వన్యప్రాణులకు ఆవాసంగా ఉన్నది. కేబీఆర్ పార్కు, మృగవణి నేషనల్ పార్కులా ఇది కూడా వివిధరకాల పక్షులు, జంతుజాలాలకు అవాసంగా ఉన్నది. భారీ కంపెనీలు నివాస సముదాయాలతో అపారమైన అభివృద్ధితో ముందుకు సాగుతున్న హైదరాబాద్‌లో 400 ఎకరాల్లోని అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేయడం వల్ల పర్యావరణ విపత్తు వాటిల్లే అవకాశం ఉన్నది. న్యాయసమీక్ష, నిపుణుల కమిటీల పరిధి నుంచి తప్పించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతంలో 30 నుంచి 40 బుల్డోజర్లు వినియోగించి అక్కడ భూమిని చదును చేస్తున్నది. ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. కేజీ ఫారెస్టు చెట్లు, ఆరు అడుగుల ముండ్ల పొదలతో పలు పక్షులు, కీటకాలకు, జంతువులకు అవాసంగా ఉన్నది. కేజీ ఫారెస్టులో పీకాక్ లేక్, బఫెలో లేక్ వంటి నీటి కుంటలు ఉన్నాయి. రెండు బిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడిన పుట్టగొడుగుల ఆకారంలో ఉన్న ప్రత్యేకమైన రాళ్లు ఇక్కడ ప్రత్యేకం. ఈ అటవీ ప్రాంతంలో 734 పూల మొక్కలు, 10 రకాల క్షీరదాలు, 15 రకాల సరీసృపాలు, 230 జాతుల పక్షులున్నాయి. ఇక్కడ జింకలు, బల్లులు, కొండ చిలువలు, నెమళ్లు, కుందేళ్లు, గుడ్లగూబలు, ఫ్లెమింగో పక్షులు, తాబేళ్లు, అడవి పందులు వంటి వాటితోపాటు హిమాలయ ప్రాంతాల నుంచి వచ్చే అరుదైన వలస పక్షిజాతులు ఉన్నాయి. కేబీఆర్, మృగవణి జాతీయ పార్కులకంటే ఎక్కువ పక్షులు జంతువులు ఇక్కడ ఉన్నాయి. ఇది వాటికంటే వైవిధ్యమైనది. అంతేగాకుండా కేంద్ర పర్యావరణ నోటిఫికేషన్ ప్రకారం 150 ఎకరాలకు మించిన ఆటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్నట్లయితే పర్యావరణ అధ్యయనం చేసి తీరాలి. చెట్లను నరకాలంటే వాల్టా చట్టం కింద సంబంధిత అధికారి వద్ద అనుమతి పొందాలి. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం అటవీ ప్రాంతాన్ని ఇతర ప్రయోజనాలకు కేటాయించినప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందాలి. కేంద్రం నుంచి టీజీఐఐసీ ఎలాంటి అనుమతులు పొందలేదు. ఈ విషయం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడైంది. ఆదాయం పెంచుకోవాలన్న ఏకైక లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ వ్యతిరేక నిర్ణయం తీసుకుని జీవో జారీ చేసింది. ప్రభుత్వం జీవుల వైవిధ్యాన్ని పట్టించుకోవడం లేదు. పిటిషన్‌పై విచారణ ముగిసే వరకు అక్కడ ఎలాంటి పనులు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి' అని పిటిషర్ కోరారు. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీ, పర్యావరణ, రెవెన్యూ శాఖల ముఖ్యకార్యదర్శులు, ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, టీజీఐఐసీ, కేంద్రం, రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణాధికారి, చీఫ్ కన్జర్వేటర్, జిల్లా కలెక్టర్లను ప్రతివాదులుగా చేశారు.